

కాలగర్భంలో క్షణాలు కూలిపోతున్నాయి. ఆ బస్సు వేగంగా సాగిపోతోంది. బస్సులో అర్పణ కూడా వుంది. ఆమె ఆనంద్ ఊరికి వెళ్లుతోంది.

ఆనంద్ కవి, రచయిత. ఈ మధ్యనే ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు అర్పణకు కాలేజీలోనే పరిచయమయ్యాడు. అతడు ఆత్మహత్య చేసుకున్నట్టు రెండు నెలల తరువాత అర్పణకు తెలిసింది.

అతని సమాధిని చూసేందుకు వెళ్ళుతోంది అర్పణ. ఆనంద్ సజీవుడై అతని డైరీల్లో, ఇంకా మిగిలిన రచనల్లో వుంటాడు. వాటిని తీసుకువేందుకు వెళ్ళుతోంది అర్పణ.

అర్పణకు రెండు పదులు దాటిన వయస్సుంది. కండ్లల్లోనూ,శరీరంలోనూ అణువణువులోనూ యవ్వనపు మెరుపు ప్రస్ఫుటంగా గోచరిస్తోంది.

బస్సులోని ప్రతి మగవాడి చూపులు ఆమె చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. గాలికి ఆమె నుదుటిపై ముంగురులు రాలుతున్నాయి. ఆమె కిటికీ లోంచి బయటికి చూస్తోంది.

చెట్లు వెనక్కి పరుగిడుతున్నాయి. భూమి తన చుట్టూ తాను గుండ్రంగా తిరగడం గుర్తుకు వచ్చింది అర్పణకు. ఆనంద్ జ్ఞప్తికి వచ్చాడు.

ఒకరోజు వెన్నెల జల్లు జల్లుగా కురుస్తూ వసంతానికి నిశ్శబ్ద నేపథ్య సంగీతాన్ని కూర్చుతోన్న వేలలో ఆనంద్ అందమైన రచనల గురించి తనతో అన్న మాటలు గుర్తుకువచ్చాయి అర్పణకు.

"నేను పునర్జన్మను నమ్ముతాను అర్పణా. అనంత శూన్యంలో ఆత్మలు పరిభ్రమిస్తుంటాయి. అందులో ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్లిన కవుల, రచయితల, చిత్రకారుల ఆత్మలు కూడావుంటాయి. అవి జీవిస్తున్న మనుష్యులలో సున్నిత హృదయం గలవాడిని ప్రేరేపించి, అదృశ్యంగా ఉత్తేజితం చేసి ఒక కళాఖండాన్నో, ఒక కవితనో, ఒక కథనో సృష్టింపజేస్తాయి. కొంతమంది చిన్న వయస్సులోనే అత్యుత్తమ రచనలు చేస్తారు. వారి రచనలకూ, ఈ జీవితపు అనుభవాలకూ చనువుకూ సంబంధమే ఉండదు. ఇదంతా పూర్వజన్మ సుకృతం అంతే!" అన్నాడు ఆరోజు ఆనంద్.

బస్సు మరో అయిదు నిమిషాల్లో ఆనంద్ ఊరికి చేరుకుంది. అప్పటికే సాయంత్రం ఆరుగంటలయ్యింది. ఊరిలోని జనం అంతా ఆమె వైపే వింతగా చూస్తున్నారు. ఆ వింత చూపులను తప్పుకుంటూ. వారి ద్వారానే ఆనంద్ ఇంటికి త్రోవ తెలుసుకుంది అర్పణ.

వేణుగోపాలస్వామి వీధిలో వుంది ఆనంద్ ఇల్లు. ఊరంతా కరువైన మెరుపేదో ఆ ఇం సంతరించుకున్నట్టుంది. వేణుగోపాలస్వామి ఆలయానికి చేరువలోనే ఉంది ఆనంద్ ఇల్లు.

ప్రహరీ గోడల్లేని ఇల్లు, సగం కూలిమి

గోడలపై పిచ్చి గడ్డి మొలిచివుంది. అదొక పెంకుటిల్లు

''భారతదేశంలో అందులోనూ తెలుగునేలలో నిజమైన రచయితల, కవుల యొక్క జీవితాలు ఎంత వికృతంగా ఉంటాయి ఈ ఇంటిలోనే. కొన్ని కష్టాలు, నిరాశ, నిస్పృహలతో కూడుకొని ఉంటాయి వారి జీవితాలు. అయితే వాళ్ల మాత్రం వాటిని చిరునవ్వుతో జీవితంలోకి ఆహ్వానిస్తారు. కన్నీళ్ల తమకు నిత్యనూతన అనుభూతులను ప్రసాదించే దేవతలకు రూపంలా భావిస్తారు'' అనుకొంది.

ఆ ఇంటి ముందు ఒక పెద్ద చెట్టుంది. ఆ సమయంలో పక్షుల కిలకిలలతో సముద్రపుహోరును సృష్టిస్తోంది.

ఆ ఇంటిలోకి అడుగు పెట్టగానే తీగమల్లె పువ్వుల పరిమళం అర్పణను స్వాగత తోరణంలా ఆహ్వానించింది. ఆమె ఆ చెట్టువైపు చూసింది. ఆ పూలల్లో, ఆ పరిమళంలో ఆమెకు ఆనంద్ ఆత్మ సాక్షాత్కరించింది.

లోపలికి వెళ్లగానే ఆనంద్ అన్నయ్య కనిపించాడు. అతన్ని అందరూ స్వామి అనిపిలుస్తారు. అర్పణ తనను తాను పరిచయం చేసుకుంది. అతను లోపలికి తీసుకెళ్లాడు. ఆతిథి మర్యాదలయిపోయ్యాయి.

అతడు తన కుటుంబంలోని వారిని ఆమెకు పరిచయం చేశాడు. మూడు గదుల్లోనూ ముగ్గురు రోగిష్టులున్నారు. ఒకరు ఆనంద్ తండ్రి, ఇంకొకరు ఆనంద్ తల్లి, ఇంకొకరు ఆనంద్ వదిన అంటే స్వామి భార్య. వాళ్లుచీకటినే ఆస్వాదిస్తున్నారు. అందులో స్వామి భార్యకు క్షయ వ్యాధి. భయంకరమైన వ్యాధి.

వరండాలోకొచ్చి కూర్చున్నారు స్వామి, అర్పణ. అక్కడ ఒకే ఒక్క దీపం వెలుగుతోంది. ఆ దీపమే ఆ మూడు గదులకూ, ఆ వరండాకు వెలుగును ప్రసాదిస్తుంది. అంతకంటే ఎక్కువ దీపాలను వెలిగించుకునేందుకు అదేం వ్యాపారస్తుడి ఇల్లు కాదు. రాజకీయ నాయకుడి ఇల్లుకాదు. కాస్త దూరంలో ఇంకొక గది తలుపులు వేసేసి ఉన్నాయి. అందులో చీకటి దేదీప్యమానంగా వెలుగుతోంది. అది స్వామి గది.

గాలికి వరండాలోని దీపం ఆరిపోయింది. స్వామి దీపం వెలిగించేందుకు లేవాడు. కానీ ఇంతలోనే అర్పణ ''నేను వెలిగిస్తాను, అగ్గిపెట్టె ఇవ్వండి'' అంది.

అతను ఆమెకు ఇచ్చాడు. అలా ఇవ్వడంలో ఆ చీకట్లో అతని చేతివేళ్లు ఆమెను స్పృశించాయి. అంతే! అతని శరీరాణువుల్లోని కోరికల తరంగాలు కండ్ల తీరాలను కౌగిలించుకొని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

అర్పణదీపం వెలిగించింది. ఇప్పుడు ఆ దీపం మరీ చిన్నగా వెలుగుతోంది. ఆ సన్నటి వెలుతురులో స్వామి అర్పణవైపు చూశాడు. అయితే ఇప్పుడు ఆ చూపుల్లో కోరికల తరంగం తాలూకు తడి చోటు చేసుకుంది. ఆ తరువాత అతను తన గదిలోకి వెళ్లి కొవ్వొత్తి వెలిగించుకున్నాడు. అర్పణ వరండాలో ఒక్కత్తే కూర్చుంది.

మెల్ల మెల్లగా వరండాలోని దీపం జీవితం పూర్తి కావొచ్చింది. ఇంకో సెకండులో ఆ సన్నటి కాంతి చనిపోతుందనగా అర్పణలేచి స్వామి గదిలోకి వెళ్లింది. ఆమె స్వామి గదిలోకి వెళ్లడం వరండాలో చిమ్మచీకటి కమ్ముకోవడం ఒకేసారి జరిగాయి.

గదిలో ఇద్దరిమధ్యా కొన్ని క్షణాల నిశ్శబ్దం, ఆ కొవ్వొత్తి వెలుగులో వింతగా నాట్యం చేసింది. ఆ తరువాత అర్పణ స్వామితో మాట్లాడింది. ఆనంద్‌తో తనకు గల పరిచయాన్ని తెల్పుకుంది. తను రావడానికి గల కారణాన్ని తెల్పుకుంది. అతని డైరీలనూ, అతని పూర్తి రచనలనూ తనకు ఇమ్మని అడిగింది.

స్వామి కండ్లలోని నిర్మలత్వము ఎగిరిపోయింది. అతని మనస్సును తన్నేస్తూ శరీరాణువులు చేస్తున్న సవ్వడి నిశ్చలమై అతని కన్నుల్లో మత్తుగా చోటు చేసుకుంది. అతడు ఆ రచనలనూ, డైరీలను అర్పణకు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. కానీ అంతకుముందు అర్పణ అతని కోరిక తీర్చాలి. అర్పణ కొన్నిక్షణలు ఆలోచించింది. అందుకు ఒప్పుకుంది. గదిలో వెలుగుతున్న కొవ్వొత్తి ఆమెకు సంకేతంలా ఉంది. ఆమెకు మార్గదర్శకంగాఉంది.

స్వామి కొత్తగా జీవం పోసుకున్న కంటి చూపులతో ఆమెవైపు మత్తుగా చూస్తున్నాడు. సూర్యుడి కిరణాలు స్పృశించినట్టుగా అతని చూపులు ఆమె శరీరాన్ని తడిమాయి.

అర్పణ తన బట్టలన్నింటినీ విడిచేసింది. నగ్నంగా వెళ్లి స్వామి ప్రక్కన పడుకుంది. అతను ఆమెను తన కౌగిలిలో హత్తుకున్నాడు. పెదవులు పెదవులను అదుపుకున్నాయి.

క్షణాలు గడిచిపోయ్యాయి. అలా ఎన్ని క్షణాలు గడిచిపోయ్యాయో తెలియదు. ఆ తియ్యటి అనుభూతికి కాలపు కొలమానం లేదు. సెకండ్లు, నిమిషాలుతో కొలవలేం శరీరాలకు సంబంధించిన శృంగారానుభూతులను.

తియ్యటి మత్తు స్వామి కండ్లల్లో నిండిపోయింది. అతడు కమ్మటి నిద్రలోకి జారుకున్నాడు. అయినా అతని మనస్సు తియ్యటి లోకపు అంచుల్లోనే, నిద్రలోనే పరిభ్రమిస్తోంది.


అర్పణ అతని వద్ద నుండి లేచింది. నగ్నంగా చేతులెత్తి నిలబడింది. పువ్వులను, ఆకులను కోల్పోయి వసంతానికి ఎదురుచూస్తున్న చెట్టులా ఉంది ఆమె. అర్పణ తన నగ్న శరీరాన్ని తానే ముద్దు పెట్టుకుంది. ఒక పవిత్ర కార్యానికి వుపయోగపడినందుకు.

తెల్లవారింది.

లైంగికమైన తృప్తినీ, శరీరానికి, కోరికలకు శాంతిని ప్రసాదించినందుకు స్వామి అర్పణకు ధన్యవాదాలు తెల్పుకున్నాడు.

అర్పణ నవ్వింది. ఆమె తన కన్నెతనాన్ని ఎవ్వరికీ అర్పించుకోని యవ్వనాన్ని అతనికి అర్పించుకుంది. అచుంబిత యవ్వనం తియ్యగా వుండదూ? త్యాగం తియ్యగా ఉండదూ? త్యాగ ఫలితాన్ని రుచి చూశాడు స్వామి. అయితే అతని మనస్సు ఆ ఫలితాన్ని వేరే రూపంలో జుర్రుకుంది.

అర్పణ తిరిగి వెళ్ళేందుకు సిద్దమయ్యింది. స్వామి ఆమెకు ఆనంద్ కాగితాలు, డైరీలు అన్నీ



ఇచ్చేశాడు. ఆమెకు ఒక చీరను ఇచ్చేడు. అర్పణ ఆ చీరను కట్టుకుంది. గులాబీరంగు చీరలో, కండ్లల్లో నిన్నలేని కాంతితో దేవతలా తోచింది అర్పణ స్వామికి. అతని కండ్లు కన్నీళ్లతో మెరిశాయి.

వెళ్లేముందు ఇంటిలోని వారందరికీ ఆమె చెప్పింది. బస్సు స్టాండు వరకూ వచ్చాడు స్వామి వీడ్కోలు చెప్పేందుకు. బస్సు వచ్చింది. అర్పణ కూర్చోగానే బస్సు కదిలింది. అక్కడ ఆ బస్సు నిలిచేది కొన్ని క్షణాలే.

తన నగరానికి చేరుకుంది అర్పణ. తన మేడకు చేరుకుంది. మేడపై తన గదిలోకి చేరుకుంది.

సూట్ కేస్ తెరిచి చూసింది. దాన్నిండా ఆనంద్ రచనలు ఎన్నెన్నో. క్షణ క్షణానికీ ఎన్నెన్నో సంఘటనలు అతనిలో కల్గించిన అనుభూతులు అందమైన అక్షరాల్లో వ్రాయబడి ఉన్నాయి. ఒక ఇన్‌లాండ్‌లెటర్ ఉంది. దానిపై తన పేరువుంది. అర్పణకు వ్రాసిన ఉత్తరం అది. ఆత్మహత్యకు ముందు రోజు వ్రాసిన ఉత్తరం అది.

చివరి క్షణాల్లో మనస్సు మార్చుకున్నాడేమో ఆమెకు ఆ ఉత్తరం పోస్టుచేయలేదు ఆనంద్. కారణాన్ని తెలుసుకోలేక పోయింది అర్పణ.

ఆ గదిలో గాలి నిశ్చలంగా ఉంది. అయినా ఆ ఉత్తరం విచిత్రంగా ఎగిరి వచ్చి ఆమె పైట కొంగును హత్తుకుంది. అందులోని అక్షరాల రూపంలో ఆనంద్ ఆత్మ మౌనంగా ఘోషిస్తుంది. ఆ ఘోష ఆమె హృదయ స్పందనలో ఇంకిపోయింది. మళ్లీ కన్నీటి బొట్టుగా వ్యక్తమయ్యింది.

అర్పణ ఆనంద్ డైరీని చేతిలోకి తీసుకుంది. అది ఈ సంవత్సరపు డైరీ. పేజీలను తిరగ వేసింది అర్పణ. ఒక పేజీలో.

"అర్పణతో నాకు విచిత్రబంధం ఉంది. అయితే ఆ బంధం సంకుచితమైన పేర్లల్లో ఇమడదు. అన్నా చెల్లెలు, ప్రేయసీప్రియుడు ఇలా ఎన్నెన్నో పిచ్చి పిచ్చి బంధాలున్నాయి మన సమాజంలో అయితే మా మధ్య బంధం మాత్రం ఈ ప్రపంచానికి సంబంధించని బంధం. పవిత్రమైన బంధం. కవిత్వానికీ, నా హృదయానికీ ఎలాంటి బంధముందో అలాంటిదే ఈ అనుబంధం" అని వ్రాసి ఉంది.

అర్పణ హృదయం సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యింది. ఆనంద్ జీవితం, కవిత్వం అభిన్నమైనవి. ఆ కవిత్వంలో తనకు సమాన స్థానాన్ని ఇచ్చినందుకు, కవిత్వంతో తనను పోల్చినందుకు గర్వపడింది అర్పణ.

డైరీ పేజీలు తిరగేసింది. ఆత్మహత్య చేసుకునే రోజుకు రెండు మూడు రోజుల ముందు ఆనంద్ ఇలా వ్రాసుకున్నాడు.

"ఈ దేశంలో ఒక రంగంలో అభిరుచి ఉన్నవాళ్లు తిండికోసం, పొట్టకోసం వేరే రంగాలలో కూడా ప్రత్యక్ష మవుతున్నారు. ఉదాహరణకు ఒక క్రికెట్ ఆటగాన్ని తీసుకుందాం. అతను తిండికోసం, తన కుటుంబం కోసం ఏ బ్యాంక్ లోనో, ఏ కంపెనీలోనో గుమస్తాగా పని చేస్తున్నాడు. ఫలితంగా అతనికి ప్రతిరోజూ కావల్సిన శిక్షణ కరువైపోతోంది. అతని లోని అభిరుచి చచ్చిపోతుంది. అలాగే ఒక రచయితను తీసుకోవచ్చు.రచయిత తిండికోసం ఫైళ్ళల్లో తలదూరుస్తున్నాడు.

క్షణక్షణానికి తనలో కల్గే మానసికానుభూతులను క్రమంలో పొందుపరచి విశ్వశాంతికి పాటుపడాల్సిన వ్యక్తి రచయిత. అతను అంకెలతో కుస్తీ పడుతున్నాడు. కొన్నాళ్లకు అతనిలోని కళాభిరుచి చచ్చి సమాజంలోని సామాన్యవ్యక్తిగా మారుతున్నాడు. దేశం ఇలా చైతన్యాన్ని కోల్పోతుంది. కొంత మంది కవులు, రచయితలు పరిస్థితులతో రాజీపడుతున్నారు. రచయితగా తన రచనల్లో ఒక జీవితాన్ని గడుపుతున్నాడు. విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. కానీ నేను అలా రాజీపడలేను.

నేను నా కథల్లోనే జీవిస్తాను. బ్రతుకు కోసం ఆఫీసుల్లో ఫైళ్ళతో కుస్తీపడుతూ ఇంకో రూపాన్ని ఎత్తలేను. అయితే ఇది విప్లవాత్మకమైన నిర్ణయం. సంఘర్షణకు తావుంది. ఆ సంఘర్షణకు తట్టుకునే శక్తి నాకు లేదు. ఆ తీరికాలేదు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకోవడం"

చదివింది అర్పణ. ఇంకో పేజీ తిప్పింది.


"నా కథలను ప్రచురించుకోవాలని వుంది. అయితే స్వంత ఖర్చులతో నేను ప్రచురించుకోలేను. ఈ కుళ్ళు మనుష్యులను అందుకు సహకరించమని అడిగేందుకు నా కవిత్వపు హృదయం అడ్డొస్తుంది. అందుకే నా కథలు పుస్తక రూపంలో రావడం కల్ల. ఒకవేళ ఎవ్వరైనా నన్ను పరిపూర్ణంగా అర్థం చేసుకుని నా కథలను ప్రచురిస్తే మాత్రం నా ఆత్మ వారికి కృతజ్ఞతాభివందనాలు తెలియపర్చుకుంటుంది. అయితే అక్షరాల పొందికలోనూ, కథలకు తగిన చిత్రాల ఎంపికలోనూ నా కవిత్వపు హృదయానికి న్యాయం చేకూర్చవల్సిందిగా వారిని వేడుకుంటున్నాను." అని వ్రాసి ఉంది.

అర్పణ సంతోషంతో ఆ బాధ్యతను తను తీసుకుంది. ఆ కార్యాన్ని యజ్ఞంలా భావించింది. ఆనంద్ కథలను ఒక క్రమంలో ఉంచింది. కాగితాలను సర్దింది.

అప్పుడామె మనస్సుకెంతో సంతోషం వేసింది. అనంత శూన్యంలోని ఆనంద్ ఆత్మ చల్లగాలి రూపంలో పరుగెత్తుకుంటూ వచ్చి అర్పణ గుండెలను ముద్దుపెట్టుకుంది. ఆమె కండ్లల్లోని కన్నీళ్లను ముద్దుపెట్టుకుంది. ఆమె పాదాలను ముద్దుపెట్టుకుంది.

ఇంకా ఎలా కృతజ్ఞతలను వ్యక్తపర్చుకోవాలో తెలియక గిలగిలా తన్నుకొంటోంది ఆనంద్ ఆత్మ.

* * *




ఒక ప్రవాహం సాగిపోతుంది పవిత్రంగా తాను ముక్కలు ముక్కలైపోయి, కాలువలు కాలువలైపోయి, నీటి చుక్కల్లా మారి నేలలో ఇంకిపోయి, చెట్టు వేళ్లలోకి ప్రాకి, కణుపు కణుపులో జీవచైతన్యంగా వెలిగిపోతుంది. పరుగులు తీస్తుంది. ఆ ప్రవాహం యొక్క త్యాగం చిట్టచివరికి ఒక అందమైన పువ్వుగా వ్యక్తమవుతుంది. పక్షుల కిలకిలా సంగమగీతంగా జన్మనెత్తుతుంది. పువ్వు గర్భంలో పరిణామక్రమాన్ని కొనసాగింపజేసే శక్తిగా సంక్షిప్త రూపాన్ని దిద్దుకొంటుంది ప్రవాహం.

ప్రవాహం జీవితం ధన్యమైనది. నిజంగాఅర్పణ ఒక ప్రవాహం.